## క్లుప్తంగా

### అభివృద్ధి పనుల బిల్లులు మంజూరు చేయించాలి



టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దారపనేని

**పామూరు:** మండలంలో ఉపాధి హామీ పథకం కింద గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు చేయించాలని టీటీడీ బోర్డు చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని కనిగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ కోరారు. బుధవారం అమరావతిలోని వైవీ క్యాంపు కార్యాలయంలో సుబ్బారెడ్డిని కలిసిన దారపనేని.. ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన రోడ్లు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణానికి చెందిన బిల్లులు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ బిల్లులు తక్షణం చెల్లించేలా చూడాలని వినతిపత్రం అందజేశారు. వైవీ సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించి వెంటనే పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపాలని, బిల్లులు మంజూరయ్యేలా చూస్తానని చెప్పినట్లు దారపనేని తెలిపారు.

### మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కఠిన చర్యలు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

**కందుకూరు:** గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలు విక్రయించడం, రవాణా చేయడం లేదా వినియోగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటారని సెబ్ ఇన్‌స్పెక్టర్ డీ వెంకటేశ్వర్లు అన్నారు. మాదకద్రవ్యాల గంజాయి, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు అరికట్టడంలో భాగంగా పట్టణంలోని బండపాలెం, ఏకలవ్యనగర్, ఉప్పుచెరువు, దూబగుంట, ఉలవపాడు మండలంలోని చాకిచర్ల, అలగాయపాలెం, ఉలవపాడు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, అమ్మడం, రవాణా చేయడం, వినియోగించడం చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి, అక్రమ మద్యం, పేకాట, కోడిపందేలు, ఇసుక రవాణా వంటి నేరాలపై 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సై మౌలాలి, సిబ్బంది పాల్గొన్నారు.

### రూ.2.75 కోట్లతో అభివృద్ధి పనులు



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్

**కనిగిరి రూరల్:** పట్టణంలోని అన్ని వార్డుల్లో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడతామని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 11వ వార్డు కాశీపురంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గఫార్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులు సుమారు రూ.2.75 కోట్లకు టెండర్లు పిలవగా, సుమారు రూ.2 కోట్ల పనులు ప్రస్తుతం పలు వార్డుల్లో జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నీటి ఎద్దడిపై నివేదికలు తయారు చేయాలి

**కనిగిరి రూరల్:** వచ్చే వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు క్షేత్ర స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు, వలంటీర్లు తక్షణ నివేదికలు తయారు చేయాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కార్యదర్శులు, సచివాలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రకాశం మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లతో సమన్వయం చేసుకుని క్షేత్ర స్థాయిలో ప్రాధాన్యత ప్రకారం తాగు, వాడుక నీటి సమస్యలను గుర్తించాలన్నారు. ఎంపీడీవో జేవీబీ మల్లికార్జునరావు, ఈవోపీఆర్డీ ఓ అన్నమ్మ, విస్తరణాధికారి జే ఫ్రాన్సిస్ బాబు, సీనియర్ అసిస్టెంట్ రహమత్‌బాషా పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్యనందించాలి

**పొన్నలూరు:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈఓ ఇడవలపాటి రవిచంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని ఉప్పలదిన్నె ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం జగనన్న గోరు ముద్ద పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. గ్రామస్తుల సహకారంతో పాఠశాలలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు.

# శివరాత్రికి ముస్తాబు



మన్నేటికోట లోని అమరలింగేశ్వరస్వామి దేవస్థానం



లోతట్టు ప్రాంతంలో ఉన్న మన్నేటికోట అమరలింగేశ్వరుని గుడి



కనీసం చదునుచేయని దుకాణాలకు కేటాయించిన భూమి

- దక్షిణ కాశీగా పేరొందిన మన్నేటికోట అమరలింగేశ్వరస్వామి దేవస్థానం
- భూమి ఎత్తుకు దిగువన ఆలయం
- శివరాత్రికి ఏర్పాట్లు

**ఉలవపాడు:** దక్షిణ కాశీగా పేరొందిన మన్నేటికోట అమరలింగేశ్వరస్వామి దేవస్థానం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఏటా మహాశివరాత్రి పండుగ రోజు తిరునాళ్ల నిర్వహిస్తారు. ఆంధ్ర, తెలంగాణల నుంచి ఇక్కడకు భక్తులు వస్తారు. పురాతనమైన ఈ ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తారు. దాదాపు 1400 ఏళ్ల క్రితం ఈ గుడిని నిర్మించారు. పల్లవరాజులు మన్నేరు ఒడ్డున ఈ గుడిని నిర్మించారు. ఆ తరువాత మన్నేటి ప్రవాహానికి ఇసుక కప్పడంతో ఈ గుడి పూడిపోయింది. 85 ఏళ్ల క్రితం ఇక్కడ గుడి ఉందని గుర్తించి ఇసుక తొలగించారు. భూమి ఎత్తుకు లోపల ఈ గుడి ఉంటుంది. తరువాత వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు భక్తులు వచ్చి అమరలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి వెళ్తుంటారు. దక్షిణకాశీగా పేరొందిన ఈ గుడికి సంబంధించిన ఉత్సవాలు ప్రతి ఏడాది శివరాత్రి నాడు దేవదాయశాఖ ఆధ్వర్యంలో నడుస్తాయి. శివరాత్రి పర్వదినాన మహామృత్యుంజయ హోమం, లింగోద్భవ అభిషేకం, శివపార్వతుల కళ్యాణం జరుగుతాయి. అలాగే ఉలవపాడులోని నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం, రాజుపాలెంలోని రత్నసాయి సురక్షిత మందిరం, శివాలయంలో కూడా శివరాత్రి పండుగ సందర్భంగా పూజలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మన్నేటికోటలో వాహనాల పార్కింగ్ ఇబ్బందికరంగా ఉంది. దుకాణాలకు ఇచ్చే స్థలాలు కూడా చదును చేయలేదు. భక్తుల సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

# వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు



కూడలి సంగమేశ్వరుడు మూలవిరాట్



కూడలి సంగమేశ్వరస్వామి ఆలయం



మిట్టపాలెంలో ఉభయ దాతలను సన్మానిస్తున్న ట్రస్టు బోర్డు చైర్మన్ జయరెడ్డి, ఈవో నారాయణరెడ్డి

**సీఎస్ పురం:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 12 నుంచి నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం గణపతి పూజ, పుణ్యాహవాచనము, వేద పారాయణము, లక్ష్య గణపతి హోమం, సరస్వతీ సూక్త హోమము, లఘు పూర్ణాహుతి, దీక్షా హవనము, వేద పారాయణము తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ విష్ణుమూర్తిస్వామి, నారాయణస్వామిలకు గజ వాహన సేవ చేపట్టి గ్రామోత్సవం నిర్వహించారు. వైఎస్సార్ కడప జిల్లా, పోరుమామిళ్లకు చెందిన సాయి మాధవి క్లాత్ షోరూం యజమాని తులసి నాగేంద్రకుమార్ శ్రేష్టి, చంద్రకళ దంపతులు ఉభయదాతలుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ట్రస్టు బోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి ఉత్సవ కార్యక్రమాలను పర్యవేక్షించారు. పూజల అనంతరం ఉభయ దాతలకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. భక్తులకు అన్నదానం చేశారు.

**16 నుంచి కూడలి సంగమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు...**

**సీఎస్ పురం:** మండలంలోని పెదరాజుపాలెం పంచాయతీలోని పెదరాజుపాలెం, నలజనంపాడు, పామూరుపల్లి గ్రామాల కూడలిలో వెలసి ఉన్న శ్రీ కూడలి సంగమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ పందిళ్లనాగమణి యల్లయ్య, ఆలయ పూజారి సుసర్ల రామకృష్ణశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న గణపతి పూజ, పుణ్యాహవాచనము, ధ్వజారోహణ, సుబ్రహ్మణ్యస్వామి వారి సహస్ర నామార్చన, అష్టోత్తర పూజలు, 17న శివసహస్ర నామార్చన, అష్టోత్తర పూజలు, 18న మహా శివరాత్రి సందర్భంగా శివసహస్ర నామార్చన, పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం, అష్టోత్తర పూజలు, పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవం, అర్ధరాత్రి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 19న పొంగళ్లు, బండ్ల ఉత్సవము తదితర పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

**18న భైరవకోన, అనుమునిగిరి క్షేత్రాల్లో అన్నదానం...**

**పామూరు:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కాశీనాయన రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ సీఎస్ పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనలో ఉదయం 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పామూరు మండలం అనుమునిగిరి క్షేత్రంలో శనివారం రాత్రి 7 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు వినియోగించుకోవాలని నిర్వాహకులు, కాశీనాయన రెడ్ల సంక్షేమ సంఘ నాయకులు తెలిపారు.

## నారాయణస్వామికి రూ.2.90 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

**సీఎస్ పురం:** గ్యాస్ పొయ్యిలు అద్దెకిచ్చుకునే హక్కు కోసం వేలం పాట నిర్వహించడం ద్వారా ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి రూ.2,90,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి తెలిపారు. నారాయణస్వామి ఆలయం వద్ద పొంగళ్లు తయారు చేసుకునే భక్తులకు గ్యాస్ పొయ్యిలు సరఫరా చేసేందుకు వేలం పాటలు నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 2024 జనవరి 31 వరకు గ్యాస్ పొయ్యిలు సరఫరా చేసే హక్కు కోసం ఈ వేలం పాట నిర్వహించారు. కోవిలంపాడు గ్రామానికి చెందిన కూరాకుల అంకయ్య రూ.2.90 లక్షలకు వేలం పాట పాడి గ్యాస్ పొయ్యిలు సరఫరా చేసే హక్కు పొందినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## వృద్ధులకు నేత్ర వైద్య పరీక్షలు

**సింగరాయకొండ:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో వృద్ధులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. 10 మంది వృద్ధులను కళ్ల జోళ్ల కోసం సిఫార్సు చేసినట్లు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌అలీ, ఎంఎల్‌హెచ్‌పీ మనీషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాగు చేసిన పంటలే ఈ క్రాప్‌లో నమోదు చేయాలి

**మర్రిపూడి:** మండలంలో రైతులు సాగు చేసిన పంటలు మాత్రమే ఈ క్రాప్‌లో నమోదు చేయాలని ఏడీఏ డి.చంద్రకళ రైతులకు సూచించారు. బుధవారం కూచిపూడి రైతు భరోసా కేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు. మండలంలోని తిప్పలదేవిపల్లి రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో సాగుచేసిన శనగ, మిరప, వరి, బొబ్బర్లు పంటలను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ.. మండలంలోని రైతులు 7 వేల ఎకరాల్లో శనగ, బొబ్బర్లు, వరి, మిరప తదితర పంటలు సాగు చేయగా ఈ క్రాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. వీఆర్‌ఓ, సర్వేయర్లతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి ఈ క్రాప్ వివరాలను సరిపోల్చి చూశారు. రైతులు ఏదైనా కారణాల వల్ల పంటలను కోతకు ముందే దున్నివేశారా? అని ప్రశ్నించారు. ఆమె వెంట టెక్నికల్ ఏఓ రాధారాణి, ఏఓ సీహెచ్ వెంకటేష్, వ్యవసాయ సహాయకులు బి.మణి, వీఆర్‌ఓ ఎన్.కృష్ణ, సర్వేయర్ భాను ఉన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

**సింగరాయకొండ:** స్థానిక కందుకూరు రోడ్డులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు బుధవారం వైద్యాధికారి చైతన్యకృష్ణ వైద్య పరీక్షలు చేశారు. ఐదుగురికి మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శానంపూడిలో 40 మందిని పరీక్షించి, మందులు అందజేశామన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌అలీ, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, ఏఎన్ఎం భారతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేగంగా అంతర్గత రోడ్ల నిర్మాణం



గ్రావెల్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

**పామూరు:** మండలంలో ప్రాధాన్యతా క్రమంలో అంతర్గత సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాజసాహెబ్‌పేటలో సచివాలయం, పంచాయతీ నిధులతో నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు పనులను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో అంతర్గత రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టి పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో బూత్ కమిటీ మండల అధ్యక్షుడు గట్లా విజయభాస్కర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ ఖాదర్‌బాషా, కొల్లూరి రవికిరణ్‌శర్మ, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి బియ్యం, దుస్తుల అందజేత

**కనిగిరి రూరల్:** దిరిశవంచలో అనారోగ్యంతో బాధపడుతున్న బత్తుల యోగయ్య కుటుంబానికి ఎంపీటీసీ వట్టివేళ్ల అంకమ్మ రెండు బస్తాల బియ్యం, రెండు జతల దుస్తులను బుధవారం అందజేశారు. ఎంపీటీసీ కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు వట్టివేళ్ల రంగబాబు, ఏపీ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వంద మందికి వైద్య పరీక్షలు

**హనుమంతునిపాడు:** ఇంటింటికి ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా బుధవారం దాసళ్లపల్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. 100 మందికి వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు, బీపీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్, వైద్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

## 32 మంది గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు

**పామూరు:** పామూరులోని సాఫల్య వైద్యశాలలో బుధవారం 32 మంది గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ కే నాగమణి తెలిపారు. గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్, థైరాయిడ్, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల పాలిట వరం సీఎం రిలీఫ్ ఫండ్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**కందుకూరు అర్బన్:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట వరం లాంటిదని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కందుకూరు పట్టణం బిలాల్ నగర్‌కు చెందిన షేక్. తహసీన్‌కు రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యాలకు గురై ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం తీసుకున్న వారికి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ పేరిట ఆదుకుంటుందన్నారు.

## పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

**ఉలవపాడు:** ఉపాధ్యాయుల, పట్టభద్రుల పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని యూటీఎఫ్, సీఐటీయూ నాయకులు బుధవారం ఉలవపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిని గెలిపించాలని కోరారు. స్థానిక కృష్ణనగర్, పాత రైల్వేరోడ్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గోపాల్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు కుమార్ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**గుడ్లూరు:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ మారుతీరావు అన్నారు. మండలంలోని పరకొండపాడు గ్రామంలో ఇంటింటా వైద్యం-ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మారుతీరావు 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి గృహాలకు వెళ్లి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

## నేడు ధరల స్థిరీకరణ సమావేశం

**కందుకూరు:** కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో పండించే వివిధ రకాల పంటలు, మద్దతు ధరలు, మార్కెట్ ధరల వ్యత్యాసంపై చర్చించేందుకు గురువారం స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో ధర స్థిరీకరణ నిధి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ కార్యదర్శి ఎం.ఖాశిం బుధవారం తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరవుతారని, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు 2,306 మంది ఓటర్లు

**సింగరాయకొండ:** మండలంలో 2,306 మంది ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు పొందినట్లు తహసీల్దార్ సీహెచ్ ఉష తెలిపారు. వీరిలో పురుషులు 1,480 మంది, మహిళలు 826 మంది ఉన్నారని వివరించారు. ఉపాధ్యాయ ఓటర్లు 198 మంది ఉండగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని నాలుగు పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జరుగుమల్లి మండలంలో ఓటర్లు 1,442 మంది ఉన్నారని తహసీల్దార్ షేక్ నయీమ్ తెలిపారు. వీరిలో పురుషులు 1,012 మంది, మహిళలు 430 మంది ఉన్నారని వివరించారు. ఉపాధ్యాయ ఓటర్లు 39 మంది ఉన్నారని తెలిపారు.

## జాబ్ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయించుకోవాలి



రావివారిపాలెంలో కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ శీనారెడ్డి, ఏపీఓ సుభాషిణి



సిబ్బందికి కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సుకుమార్

- డ్వామా పీడీ శీనారెడ్డి

**టంగుటూరు:** జాబ్ కార్డును ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేయించుకోవాలని డ్వామా పీడీ శీనారెడ్డి సూచించారు. టంగుటూరు పంచాయతీలోని రావివారిపాలెం అమ్మవారి కుంట వద్ద ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ.. మార్చి 31 నాటికి 100 పని దినాలు పూర్తవుతాయన్నారు. ఏపీఓ సుభాషిణి మాట్లాడుతూ.. ప్రస్తుతం రావివారిపాలెం గ్రామంలో 63 మంది పని చేస్తున్నారని, మండలంలో 968 మంది కూలీలకు రోజూ పని కల్పిస్తున్నామని వివరించారు. ఈసీ దివికుమార్, టీఏ బాబు, ఎఫ్ఏ మనోహర్, సిబ్బంది ఉన్నారు.

**ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి**

**గుడ్లూరు:** గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా ఏపీడీ సంజీవరావు అన్నారు. స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులపై టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్‌లకు బుధవారం ఏపీడీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లో పనులు అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలన్నారు. ప్రతి కూలీకి రోజుకు రూ.257 కూలీ నగదు పడేలా కొలతలు ఇచ్చి ఫీల్డు అసిస్టెంట్‌లు పనులు చేయించాలన్నారు. ప్రతి కూలి ఆధార్ కార్డు నంబరును వారి బ్యాంకు అకౌంట్‌లకు అనుసంధానం చేయించాలన్నారు. అలా చేస్తేనే వారి ఖాతాల్లో కూలీ నగదు పడుతుందని చెప్పారు. సమీక్ష సమావేశంలో ఏపీఓ వినయ్, ఈసీ వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

**6,530 జాబ్‌కార్డులు తొలగింపు**

**సింగరాయకొండ:** మండలంలో మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 6,530 జాబ్ కార్డులు తొలగించినట్లు ఏపీఓ సీహెచ్ సుధాకరరావు తెలిపారు. మండలంలో మొత్తం 14,658 జాబ్‌కార్డులు ఉండగా ఆధార్ అనుసంధానం చేయని కార్డులు మాత్రమే తొలగించినట్లు వివరించారు. ప్రస్తుతం మండలంలో 8,128 జాబ్‌కార్డులు ఉన్నాయని వెల్లడించారు.

**ఉపాధి సిబ్బందికి కిట్ల పంపిణీ**

**వెలిగండ్ల:** ఉపాధి సిబ్బందికి వెలిగండ్ల ఉపాధి కార్యాలయంలో ఎంపీడీవో టి.సుకుమార్ బుధవారం మెడికల్ కిట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది, కూలీలు మెడికల్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అంకమ్మతల్లి దేవాలయ పునః నిర్మాణ పనుల పరిశీలన



అంకమ్మతల్లి దేవాలయ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

**కందుకూరు అర్బన్:** కందుకూరు గ్రామ దేవత అంకమ్మతల్లి దేవాలయ పునః నిర్మాణ పనులను ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. దేవాలయం పై కప్పు స్లాబు పనులు, అమ్మవారిని గర్భగుడిలో ప్రతిష్టించిన తరువాత భక్తులు నిర్ణీత దూరంలో ఉండి అమ్మవారిని దర్శించుకోవడానికి ఎత్తు సరిపోతుందా లేదా, స్తంభాలకు శిల్పులు చెక్కిన బొమ్మలను క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంకమ్మతల్లి దేవాలయం మొదటి దశ పనులను పూర్తి చేసి త్వరలో ప్రారంభించుకోవడానికి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ నెల 17 ఉదయం 8 గంటలకు దేవదాయ శాఖ అదనపు కమిషనర్ ఆజాద్ దేవాలయం పనులు పరిశీలనకు వస్తున్నారని, ప్రజలు పాల్గొని తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. అదే రోజు అంకమ్మతల్లి దేవాలయం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన కమిషనర్ ఆజాద్‌తో చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు తల్లపనేని వెంకటేశ్వర్లు, మాదాల మాల్యాద్రి, వేణుగోపాల్ రెడ్డి, ఆవుల మాధవరావు, కొడాలి కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు జాజుల కోటేశ్వరరావు, నగళ్ల నారయ్య, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ కంటి వెలుగు విద్యార్థులకు వరం



విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేస్తున్న కంటి వైద్యుడు కృష్ణారెడ్డి

**టంగుటూరు:** వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం విద్యార్థులకు వరం లాంటిదని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కంటి వెలుగు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ఆప్తాలమిక్ వైద్యులు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర పాఠశాలలో 350 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించగా 17 మంది దృష్టి లోపంతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. అలాగే బాలికల గురుకుల పాఠశాలలో 140 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా 19 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరికి ప్రభుత్వం కళ్లజోళ్లు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ బాలాజీ అశోక్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది అనురాధ, ఉపాధ్యాయుడు కామేశ్వరరావు పాల్గొన్నారు.